ఉచిత డిఎస్‌సి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పాడేరు : రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆదేశముల మేరకు అర్హత గల బీసీ ఎస్సీ ఎస్టీ ఈ బీసీ విద్యార్థులకు మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత ఆన్లైన్ కోచింగ్‌ను అందించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమసాధికారత అధికారి ఎం. నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత ఆన్ లైన్ కోచింగ్ తీసుకోవడానికి అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు స్వంత జిల్లాలలోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల ధృవీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికేట్, ఆదాయ ధృవీకరణ పత్రం, టెట్ పరీక్షలో అర్హత సాధించిన పత్రం వంటి ధ్రువపత్రాలు జతపరచాలని సూచించారు. పూర్తీ చేసిన దరఖాస్తును సంబంధిత వెనుకబడిన తరగతుల సంక్షేమం సాధికారత అధికారి కార్యాలయము, అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు)కి సమర్పించాలన్నారు. ఇతర వివరములకు 8106999039, 9441293675లో సంప్రదించాలని కోరారు.

ప్రతి ఇంటికీ దోమల మందు పిచికారీ చేయాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

దోమల మందు పిచికారీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు :- ఎంపిక చేసిన గ్రామాలలో మలేరియా నివారణ మందును పిచికారి చేయాలని, ప్రతి ఇంటి బయటే కాకుండా ఇంటి లోపల కూడా పిచికారి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మలేరియా విభాగం అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ దగ్గర గల కుమ్మరిపుట్టులో మలేరియా నివారణకు దోమల మందు పిచికారి కార్యక్రమాన్ని లాంచనగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఒక ఇంటిలోకి ప్రవేశించి ఆ ఇంట్లో నిత్యావసరాలు, వంట పాత్రలపై దగ్గరుండి పరదాలు కప్పించి ఇంటిలో దోమల మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల 311 సచివాలయాల ప్రాంతాలలోని 2,086 ఎంపిక చేసిన గ్రామాలలో 5.16 లక్షల జనాభా లక్ష్యంగా పిచికారి కార్యక్రమం మొదటి దశను రెండు నెలలలో పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి రెండవ దశ కార్యక్రమాన్ని జూలై ఒకటవ తేదీ నుండి చేపట్టాలన్నారు. మొదటిరోజైన మంగళవారం 33 గ్రామాలలో పిచికారి లక్ష్యం కాగా ఇప్పటి వరకు 21 గ్రామాలలో పూర్తి చేయడం జరిగిందని డి.ఎం.ఓ తులసి కలెక్టర్ దష్టికి తీసుకు వచ్చారు. ఈకార్యక్రమంలో డిఎంఓ తులసి, డిఎంహెచ్ఓ . జమాల్ బాష, మలేరియా విభాగం సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మన మిత్ర' పై అవగాహన కల్పించండి

పాడేరు, :- ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన వాట్స్ యాప్ గవర్నెన్స్ (మన మిత్ర) పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖల అభివృద్ధి పై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, వాట్స్ యాప్ (మన మిత్ర) నంబర్ 9552300009 ద్వారా చాటింగ్ చేయవచ్చని, ఆ నంబర్ మొబైల్‌లో సేవ్ చేసుకుని హాయ్ అని పెట్టడం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న 161 సేవలను ఇంట్లోనుండే పొందవచ్చన్నారు. రెవిన్యూ, మునిసిపల్, ఆర్టీఎ, ఆర్టీసి, దేవాలయాల దర్శనం, రూమ్ బుకింగ్ తదితర సేవలను పొందవచ్చన్నారు. ఈ యాప్ పై సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మూడవ శనివారం జరుగుచున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర లో భాగంగా ఈ మూడవ శనివారం ప్రభుత్వ సూచనల మేరకు ఇ. వేస్టేజ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇ వేస్టేజ్ చెక్ చేసి వాటిని సరైన విధానంలో డిస్పోజ్ చేయాలని ఆదేశించారు.సంతలలో ముఖ్య కూడళ్ళలో ఇ వేస్టేజ్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

జిల్లాలో ఉన్న 7661 మంది విభిన్న ప్రతిభావంతులు సదరం శిభిరాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరి డాటా సేకరించి వారికి ప్రభుత్వ పరంగా లబ్ది చేకూర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో 20 ఎకరాల నిరుపయోగ భూమిని గుర్తించి 11 కెవి విద్యుత్ సామర్ధ్యం గల సోలార్ పేనల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్ రెండు రోజుల్లో స్థలం గుర్తింపు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఒ ఎస్ఎస్ఆర్కే పట్నాయక్, ఆర్ డబ్ల్యు ఎస్ ఇఇ జవహర్ కుమార్, జి డబ్ల్యు ఎస్ నోడల్ అధికారి పిఎస్ కుమార్, వర్చువల్ విధానంలో మూడు ఐటిడిఎల పిఒ లు, సబ్ కలెక్టర్లు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-జిమాడుగుల: మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళవారం వారపు సంత కావడంతో నిత్యావసర వస్తువులు కొనుగోలుకై వచ్చిన గిరిజనులు వర్షం తాటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది, ఈదురు గాలుల కారణం వల్ల మండల కేంద్రంలో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది,

సీలేరు:జీకే వీధి మండలం సీలేరు, దారకొండ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండగా, మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఒక్కసారిగా మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. అనంతరం సీలేరు, దారకొండ, ధారాలమ్మ ఘాట్ రోడ్లో భారీ వర్షం కురిసింది. దీంతో ధారాలమ్మ ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. గాలి వర్షం కారణంగా దారకొండ, గుమ్మిరేవులు, ఎ.దారకొండ, గాలికొండ పంచాయతీల పరిధిలో మామిడి, జీడి మామిడి పంటలకు అపార నష్టం కలుగుతుందని గిరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బురదలో కూరుకుపోయి రహదారి అంచున ప్రమాదకరంగా ఉన్న బస్

బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కారణంగా గుమ్మిరేవులకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సు మాదిమల్లు వంతెన సమీపంలో బురదలో కూరుకుపోయింది. వెనుక చక్రం మట్టి రహదారి అంచులో కూరుకుపోవడంతో ఈ మార్గంలో మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతి రోజులాగే నర్సీపట్నం నుండి గుమ్మరేవులు వెళ్లిన బస్సు తిరుగు ప్రయాణంలో మాదిమల్లు వంతెన వద్దకు వచ్చేసరికి వర్షం కారణంగా బస్సు వెనక్కి జారి దిగబడిపోయింది. ఇందులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగానే ఉన్నారు. విషయం తెలుసుకున్న గుమ్మిరేవుల సర్పంచి మురళి కమలమ్మ బస్‌ను బయటికి తీసేందుకు చర్యలు చేపట్టారు. జెసిబిని తీసుకొచ్చి బెల్టు సహాయంతో బస్సుని సురక్షితంగా ముందుకు లాగారు.

రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

మాదిమల్లు నుంచి గుమ్మిరేవుల వరకు రహదారి, వంతెన నిర్మాణం తక్షణమే చేపట్టాలని మాదిమల్లు గుమ్మిరేవులు గ్రామస్తులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గతేడాది సెప్టెంబర్ 8న భారీ వర్షాలు కారణంగా రహదారి, వంతెన కొట్టుకుపోయి అస్తవ్యస్తంగా మారిన విషయం విధితమే. అప్పట్లో తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా కోతకు గురైన రహదారిని మట్టితో ఫిల్లింగ్ చేసి డైవర్షన్ రోడ్డు నిర్మించారు. కాని నేటికీ శాశ్వత రహదారి నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ద్విచక్ర వాహనాల నుంచి పెద్ద వాహనాల వరకు ఈ రహదారిలో రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. కలెక్టర్‌కు, అధికారులకు పత్రికల ద్వారా రహదారి సమస్యపై మొరపెట్టుకుంటున్నా రహదారి నిర్మాణానికి ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. తాజాగా మంగళవారం కురిసిన భారీ వర్షాలకు మట్టి రహదారి పూర్తిగా బురద మయంగా మారిందని, ఈ క్రమంలోనే నర్సీపట్నం గుమ్మరేవుల బస్ సర్వీస్ బురదలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అత్యవసర సమయంలో తమ గ్రామాలకు రహదారి సౌకర్యం లేక అంబులెన్స్ రాలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఎ పిఓ అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కష్టపడ్డ వారికే ప్రాధాన్యం

టిడిపి అరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర

మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి అరకులోయ రూరల్:పార్టీలో కష్టపడ్డ వారికే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర పేర్కొన్నారు. అరకులోయలోని టిటిడి కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటుపై దొన్నుదొర అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. అరకు నియోజకవర్గ పరిధిలోని అనంతగిరి,అరకు, డుంబ్రిగూడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్ మండలాల అధ్యక్షులు,కార్యదర్శులు,ఎంపీటీసీలు, సర్పంచులు, ముఖ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, పార్టీలో కీలకంగా వ్యవహరించకుండా పదవులను ఆశించొద్దని సూచించారు .వ్యక్తిగత ప్రయోజనాల కోసమో వర్గాలుగా ఏర్పడడం కోసమో పార్టీని ఉపయోగించుకోవద్దని సూచించారు. అన్న ఎన్టీ రామారావు ఆశయాల సాధన దిశగా తెలుగుదేశం పార్టీని పటిష్ట చేయాలని పిలుపునిచ్చారు. తానైనా, మీరైనా పార్టీ నిబంధనలకు అనుగుణంగా పని చేసినప్పుడే భవిష్యత్తు ఉంటుందని, ఈ విషయాన్ని మరిచిపోవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో అరకువేలి మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, డుంబ్రిగుడ మండల అధ్యక్షులు తుడుం సుబ్బారావు, ముంచంగిపుట్టు మండల అధ్యక్షులు కిల్లో బలరాం, మాజీ ఎంపీపీ కొండయ్య, ముంచంగిపుట్టు టీడీపీ నాయకులు సన్యాసమ్మ, అరకువేలి మండల నాయకులు బోరి బోరి లక్ష్మి, గంగ, మాజీ సర్పంచ్ సుబ్బారావు, వనభంగి సర్పంచ్ లక్ష్మణ్, మాదల సర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మహాదేవ్, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత మగ్గన్న

పెంచిన ఇంటి పన్నును తగ్గించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని పెదలబుడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పెంచిన ఇంటి పన్నును వెంటనే తగ్గించాలని పేసా కమిటి ఉపాధ్యాక్షులు కిల్లో జగన్నాథ్, సిపిఎం మండల నేత మగ్గన్న డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన గ్రామ సభలో సమస్యలపై లేవనెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంటి పన్ను మూడింతలు పెంచడం తో సామాన్య గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండల కేంద్రంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయిందని దీంతో మురుగునీరు నిల్వ ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతుందన్నారు.దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. పంచాయతీ పరిధిలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ఈ గ్రామసభలో సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, ఎంపీటీసీలు డి ఆనంద్, శత్రుగున్, భీమరాజు ,పేసా కమిటి కార్యదర్శి జన్ని సురేష్, పంచాయతీ కార్యదర్శి పి రాజ్ కుమార్, కొర్రా ప్రశన్న పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-గంగవరం : గంగవరం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో నెల 16న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ వై.లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

మారని వైద్యుల తీరు

ప్రజాశక్తి- హుకుంపేట:వైద్యులు విధులకు డుమ్మా అనే శీర్షికన ప్రజాశక్తిలో ఆదివారం కథనం వెలువడింది. అయినా వైద్యాధికారుల తీరు మారలేదు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఇద్దరు వైద్యులు సోమవారం విధులకు హాజరు కాలేదు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ సందర్శించారు. వైద్యాధికారులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో మీడియాకు ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. మంగళవారం కూడా వైద్యాధికారి సౌజన్య పీహెచ్‌సిలో జాడ కాన రాలేదు. విధులకు హాజరుకాని వైద్య అధికారులకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటే ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతాయని రోగులు తెలిపారు.జిల్లాకు కూతవేలు దూరంలో ఉన్న హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు అందుబాటులో లేకపోతే మారుమూల పిహెచ్ లో పరిస్థితి ఎలా ఉంటుందో ఈ పరిస్థితి చూస్తే అర్థమవుతుంది. హెడ్ క్వార్టర్ లో 24 గంటలు విధులకు వైద్యాధికారులు ఇద్దరిలో ఒకరైన అందుబాటులో ఉండాలి. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని రోగులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి విధులకు డుమ్మా కొడుతున్న వైద్యధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

ఒప్పందాలను ఎపిఎఫ్‌డిసి యాజమాన్యం అమలు చేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి:ఒప్పందాలను అమలు చేయడంలో ఏపీఎఫ్‌డిసి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కాఫీ కార్మికులు మండి పడ్డారు. మంగళవారం స్థానిక సీఐటియు కార్యాలయంలో కాఫీ కార్మికులు, ఏపీసీలు, కింద స్థాయి ఫీల్డ్ ఉద్యోగులు, జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవంబర్ 4, 2024న చింతపల్లి ప్రధాన కార్యాలయంలో ఏపీఎఫ్‌డిసి యాజమాన్యం, ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, రీజినల్ మేనేజర్ విశాఖపట్నం సమక్షంలో జరిగిన చర్చల్లో ఇచ్చిన 10 డిమాండ్లలో ఒక్కదాన్ని కూడా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కేవలం నెలవారీ జీతాన్ని రూ.1500 పెంచినదే తప్ప, మిగిలిన హామీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 5 నెలలు కావస్తున్నా చర్చల్లో ఉన్న అంశాలలో ఏ ఒక్కటి పరిష్కారం చేయలేదన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ఉద్యోగులు లేకుండా సంస్థ రక్షణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సంస్థ రక్షణ కోసం ఏపీఎఫ్డిసి యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా ఉంటూ తమకు జీతాలు వస్తే చాలు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు వారాంతపు పేమెంట్లు ఇస్తామని హామీ ఇచ్చి మరిచా(న్నారు.కార్మికుల క్వార్టర్లు మరమ్మతు ఊసే మరిచారన్నారు. తోటలలో పనిచేస్తున్న వాచ్మెన్ లకు ఆరు నెలల నుండి జీతాలు లేక విలవిలాడుతున్నారన్నారు. అన్ని డివిజన్లో మేనేజర్లకు హామీలు అమలు కోసం వినతి పత్రం ఇవ్వనున్నట్లు ఆయన తెలియజేశారు. అప్పటికి స్పందించకపోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు కనకవల్లి, ఉద్యోగులు మోరి గిరి, వెంకటేష్, కాంతారావు, రాజారావు, నాగేష్, పాపరావు, కాఫీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా గ్రామాలను 41.15 కాంటూరులో కలుపుతూ

జిఓ విడుదల చేయాలి

సిపిఎం నేతలు సున్నం రాజులు, పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రాధాన్యతా గ్రామాలను 41.15 కాంటూరులో కలుపుతూ జిఓ విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దమట్టపల్లిలో సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఫేస్ వన్ బి ముంపు గ్రామాలుగా సర్వేలు చేస్తున్న విఆర్ పురం, వడ్డిగూడెం, రాజుపేట, తోటపల్లి, చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, వెంకన్నగూడెం, రామవరం, సోములగూడెం, లక్ష్మీనగరం, చొప్పల్లి గ్రామాలను 41.15 కాంటూర్ గ్రామాలుగా గుర్తించి తక్షణమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని కోరారు. ఎటువంటి ప్రభుత్వ జీవో లేకుండా సర్వేల పేరుతో నిర్వాసితులను మోసం చేయడం దారుణమన్నారు. నిజంగా జిఓ ఉంటే దానిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రెండు మూడు సంవత్సరాల క్రితం కటాఫ్ డేట్ ప్రకారం సర్వేలు చేయడం వలన ఇప్పటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే నష్టపరిహారం పొందిన నిర్వాసితులను పునరావాసం పేరుతో కాలనీలకు పంపే ప్రయత్నం చేస్తున్నారని, కానీ ఆ కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని, ఇలా అయితే ఆ కాలనీల్లో ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముంపు ప్రయారిటీ గ్రామాలను తక్షణమే 41.15 కాంటూరులో కలుపుతున్నట్లు జీవో విడుదల చేయాలని, ముంపు బాధితుల ఆకాంక్షల మేరకు వారు కోరిన చోట ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని, ఆర్ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిర్వాసితులను కలుపుకొని భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచులు వెట్టి లక్ష్మి, సవలం మారయ్య, పూనెం సరోజిని, కారం బుచ్చమ్మ, ఎంపీటీసీ పూణెం ప్రదీప్‌కుమార్, మండల కమిటీ సభ్యులు ఫంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, గుండుపూడి లక్ష్మణరావు, సిరపు తాతబాబు, వడ్లాది రమేష్, కదల కొండయ్య రెడ్డి, తుర్రం బాబురావు, కారం సత్తిబాబు, కమ్మసిచ్చు సత్యనారాయణ, మండలంలోని ముఖ్య నాయకులు, శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

జిసిసిలో అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు

విశాఖపట్నం కేంద్రంగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న వివిధ గిరిజన సహకార సంస్థల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర మార్క్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేరుకే గిరిజన సహకార సంస్థ కానీ పెత్తనమంతా గిరిజనేతరులుదేనని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ప్రకటించబోతున్న పదోన్నతులు విషయంలో ఒకరు వద్ద నుంచి మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు తీసుకొని అర్హత లేని వారికి అందరం ఎక్కించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీనియర్లకు పక్కన పెట్టి జూనియర్లకు ఎఫ్ఎసి మేనేజర్‌గా బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు. గతంలో అనేకమంది అక్రమాలు చేసి సస్పెండ్ అయిన వారికి ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే జిసిసి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ స్పందించి కింద స్థాయిలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకులు కాంతారావు, బాలకృష్ణ, శేషాద్రి పాల్గొన్నారు.

నేడు వైసిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-గంగవరం

మండలంలోని పాతగంగవరం గ్రామంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ నెల 16 బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరుగుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల తర్వాత వైసిపి పజాప్రతినిధులు, కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలు గురించి ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు. కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రంపచోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రికల్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వివిధ రకాల అగ్ని ప్రమాదాలచ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షించుకునే పద్ధతులపై అగ్నిమాపక శాఖ అధికారులు ప్రయోగాత్మకంగా డెమో చేసి చూపించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ ఎమ్ఆర్ఓ రామకృష్ణ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ వారం రోజులపాటు వివిధ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది గంగన్న దొర, కెజిబివి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ధర్మతాళగూడెంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని వడ్డిగూడెం స్థానిక సర్పంచ్ సోడే నర్సమ్మ మంగలవారం ప్రారంభించారు. ధర్మతాళగూడెం, రామవరం, పెద్ద మట్టపల్లి, రేఖపల్లి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహణకు చేయడానికి గ్రామ సచివాలయ సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. గ్రామ స్థాయిలో 100 శాతం ఆధార్ నమోదుకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యత గ్రామ తీసుకొని సచివాలయ సిబ్బంది ఆధార్ శిబిరం నిర్వహణలో సమన్వయం చేయాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, సూపర్ వైజర్, మహిళా పోలీసు సిబ్బంది వారు ప్రజలను తీస్కొని రావటానికి బాధ్యత అప్పగించాలని డిమాండ్ చేశారు. శిబిరం నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు వుంటాయని ఎంపిడిఒ హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని గ్రామ సచివాలయల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు అందిస్తున్న దృశ్యం

పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పశువుల తొట్టెల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ పరిధిలో దుంబ్రివలస గ్రామం వద్ద పశువుల మంచినీటి తొట్టెల నిర్మాణానికి జనసేన పార్టీ హుకుంపేట మండల ఉపాధ్యక్షులు మజ్జి కృష్ణం రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మజ్జి సురేష్ కుమార్ మంగళవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువులకు తాగునీటి తొట్టెలు పశు సంపద పరిరక్షణకు నిర్మాణం చేపట్టనున్నారు. 33వేల వ్యయంతో పశువుల తొట్టి నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వీటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. పశువులు నీళ్లు తాగడానికి అనువుగా ఉండే విధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ సభ్యులు కేరింగి చందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సిఐ వినోద్‌బాబు

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: ఈనెల 24 నుంచి 27 వరకు నిర్వహించ తలపెట్టిన ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో ఆలయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చింతపల్లి సిఐ వినోద్ బాబు అన్నారు. మంగళవారం ఎస్సై లు వెంకటేశ్వరరావు, వెంకటరమణ లతో కలిసి తొలిత జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో బాణాసంచా పేల్చే ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణం ను క్షుణ్ణంగా పరిశీలించారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ప్రత్యేకంగా సమావేశమై ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంపై చర్చించారు. అనంతరం సిఐ వినోద్ బాబు మాట్లాడుతూ జాతర సమయంలో ఎక్కడ ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

19న రంపచోడవరంలో కుస్తీ పోటీలు

ప్రజాశక్తి-పాడేరు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 19న రంపచోడవరం ఇర్రిపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో అండర్ 14, అండర్ 17 వయసుగల బాలికలకు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రాధికార అధికారి ఎ. జగన్మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి కలిగిన కుస్తీ క్రీడాకారిణిలు తమ పుట్టినతేది ధ్రువీకరణ పత్రంతో ఆ రోజు ఉదయం7:30 గంటలకు కుస్తీ పోటీలు నిర్వహించనున్న ప్రదేశంలో హాజరు కావాలని ఆయన కోరారు. ఇతర వివరములకు ఎం. రత్నరాజు, రెజ్లింగ్ కోచ్ ను 9000904610, 9000274225 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : పదవ తరగతి తరువాత ఇంటికి వెళ్ళిపోయే 18 ఏళ్ళ లోపు బాలికలపై ప్రత్యేక దృష్టి సారించి బాల్య వివాహాలు జరగకుండా నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బాల్య వివాహ నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహాలను గ్రామ స్థాయిలోనే గుర్తించాలన్నారు. గ్రామ, మండల, డివిజనల్ స్థాయి చైల్డ్ మేరేజ్ ప్రొబేషన్ ఆఫీసర్స్ సమర్ధవంతంగా పని చేయాలన్నారు. కిశోరి వికాసంలో సఖి గ్రూప్స్ సమర్ధవంతంగా పనిచేస్తే బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సి తగ్గుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన పిల్లలకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇప్పించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో ఐదేళ్ళు దాటిన పిల్లలను ఒకటవ తరగతిలో జాయిన్ చేయాలని, ఈ నెల 21,22,23 తేదీలలో అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసు, సిడిపిఒ లు గ్రామస్తుల సహకారంతో పండగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. మిషన్ వాత్సల్య స్పానషర్షిప్ అప్లికేషన్స్ అన్నిటిని ఐ. సి. డి. ఎస్, ప్రాజెక్టు ఆఫీస్ కు పంపించాలన్నారు. కిశోరి బాలికలకు సమ్మర్ క్యాంప్ ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశానికి గైర్హాజరైన ఇద్దరు ప్రొబ్షనరి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ ఇన్ చార్జ్ పిడి ఎస్తేర్ రాణి, డిఇఒ పి. బ్రహ్మాజీ రావు, ఎస్ఎస్ఎ ఎపిసి స్వామి నాయుడు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి డా. పి. రోహిణి, కార్మిక శాఖ ఏసి టి. సుజాత, ఎస్ డి సి ఎం.వి ఎస్ లోకేశ్వర రావు, జిసిడిఒ సూర్యకుమారి, జిల్లా బాలల రక్షణ అధికారి టి. సద్దు, ఐసిడిఎస్ సిడిపిఒలు, వర్చువల్ విధానంలో ఐటిడిఎ ల ప్రాజెక్ట్ అధికారులు, ఎంఇఒ లు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ - శ్రమ కార్డులకు నమోదు చేసుకోండి

వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గన్నేరు పుట్టు సచివాలయంలో ఈ శ్రమ కార్డులకు డిజిటల్ అసిస్టెంట్ లావణ్య మంగళవారం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, అసంఘటిత రంగ కార్మికులు, కూలీలు తాపీ మెస్త్రీలు, సెంట్రింగ్ కార్మికులు, వెల్డర్స్ ఈ శ్రమ కార్డులకు సచివాలయాల్లో ఉచితంగా నమోదు చేసుకోవాలని కోరారు.గన్నేరు పుట్టు సచివాలయాన్నీ సందర్శించి రైతులకు కార్డులు వేగవంతం చేసి పెట్టాలని ఆయన డిజిటల్ అసిస్టెంట్లకు ఆదేశించారు.16 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన సంఘటిత రంగ కార్మికులకు ఈ శ్రమ కార్డుల ద్వారా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నమోదైన కార్మికుడికి రూ 2 లక్షల ప్రమాద భీమా ఉంటుందన్నారు., ప్రమాదానికి గురై మరణం లేదా పూర్తి అంగవైకల్యం సంభవించి నప్పుడు రూ 2 లక్షలు ఇస్తారనీ, పాక్షికంగా అంగవైకల్యం కలిగి ఉంటే ఈ ఇన్సూరెన్స్ కింద రూ 1 లక్ష రూపాయల అందుతాయన్నారు. ఈ శ్రమ కార్డు నమోదుకు ఆధార్ కార్డు, అకౌంట్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చీకుమద్దుల పెసా ఉపాధ్యక్షుడు వెలగ రాజారావు, సూకూరు లక్ష్మయ్య, వెలగ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నమోదు చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

నేరాలు ఘోరాలు

పిడుగుపాటుకు నాలుగు పశువులు మృతి

మృతి చెందిన పశువులు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో పిడుగు పడింది. పెదపాడులో ఈదురు గాలులు, మెరుపులతో కురిసిన భారీ వర్షంతో పిడుగుపాటుకు గురై మూగజీవాలు మృత్యువాత చెందాయి. గ్రామానికి చెందిన కొర్రా హరి అనే 'గిరిజనుడి నాలుగు దుక్కి పశువులు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. సుమారు రూ 1లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి అదుకోవాలని ఆయన కోరారు.

ఏకపక్షంగా జిల్లా ఒలింపిక్ సంఘం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా ఒలింపిక్ సంఘం (విడిసిఎ) ఏకపక్షంగా వ్యవహరించడం, క్రీడాకారుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం మంచిది కాదని ఫస్ట్ క్లాస్ మాజీ క్రికెటర్, న్యాయవాది ఎస్కె హుస్సేన్ పేర్కొన్నారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ఒలింపిక్ సంఘం పాలకవర్గం గడువు 2023తో ముగిసిందని తెలిపారు. అప్పటినుంచి నేటి వరకు ఎన్నికలు జరగలేదన్నారు. కొందరు జిల్లా ఒలింపిక్ సంఘం పేరుతో, వివిధ స్థాయిలో క్రికెట్ క్రీడాకారులను ఎంపిక చేస్తూ, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సుమారు 25 లక్షల మంది జనాభా కలిగిన విశాఖ నగరంలో అన్ని ప్రాంతాల నుంచి క్రీడాకారులు, ఎంపిక పోటీలకు హాజరయ్యే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. ఒలింపిక్ సంఘం పేరు చెప్పుకొని, వారి వారి క్లబ్బులకు చెందిన క్రీడాకారులను మాత్రమే, వివిధ పోటీలకు ఎంపిక చేస్తున్నారని ఇది మంచిది కాదని పేర్కొన్నారు. గత పదేళ్లుగా సెలెక్టర్లుగా ఉన్నవాళ్లే కొనసాగుతున్నారన్నారు. వారికి నచ్చిన వారిని ఎంపిక చేస్తున్నారన్నారు. ఐపిఎల్‌లో ఎందరో యువ క్రికెటర్లు అద్భుతంగా ప్రతిభను చాటుతున్నారని, నగరంలో కూడా ఓపెన్ సెలక్షన్లు ఉండాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం చట్ట విరుద్ధ చర్యలను తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. దీనిపై వివిధ స్థాయిలలో ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేస్తామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. సమావేశంలో యువ క్రికెటర్లు, వారి తండ్రులు పాల్గొన్నారు.

నిర్వాసిత సమస్యలు జటిలం

- టిడిఆర్ జారీకి వ్యతిరేకత
- పట్టించుకోని ప్రభుత్వం
- అనధికార బాణసంచా తయారీ
- లోపించిన పర్యవేక్షణ
- చెరుకు రైతుకు ఇవ్వని బకాయి
- నేడు జిల్లా పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశంలో తమ సమస్యలు చర్చకు వస్తాయని నిర్వాసితులు, చెరకు రైతులు రోడ్డు విస్తరణ బాధితులు ఆశిస్తున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జెడ్‌పి సర్వసభ్య సమావేశం జరగనుంది. నక్కపల్లి మండలంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకుండానే స్వాధీనం చేసుకొని పనులు ప్రారంభించడంపై బాధితులు పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలంలో నిర్వాసితుల సమస్య జటిలమవుతోంది. జిరాయితీ భూములకు పరిహారమిచ్చి, కొబ్బరి చెట్లకు రూ.5 వేలు చొప్పున చెల్లిస్తామని రూ.1500లోపే చెల్లించారు. డి పట్టా భూముల్లో చెట్లకు పరిహారం ఇవ్వలేదు. సాగుదారులకు పైసా పరిహారం ఇవ్వలేదు. భూములు పోగొట్టుకున్న వారికి పరిహారం చెల్లింపు సమస్య పరిష్కారంకాకుండానే, తరలింపు గ్రామాల ఇళ్లకు పరిహారం సంపూర్ణంగా ఇవ్వకుండానే, మేజర్లను గుర్తించి ప్యాకేజీ ప్రకటించకముందే ఆర్సెల్లార్ మిట్టల్, బల్క్ డ్రగ్ పార్కుకు ప్రభుత్వం భూములు కేటాయించడం వివాదస్పదమవుతోంది. ఈ నియోజకవర్గంలోని కోటవురట్ల మండలం, కైలాసపట్నంలో బాణ సంచా తయారీ ప్రమాదంలో ఇటీవల ఎనిమిది మృతిచెందారు. వీరి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా అందలేదు.

జిల్లాలో అనధికారికంగా 19 బాణసంచా తయారీ కేంద్రాలున్నట్లు అధికారులు గుర్తించారు. అనధికారికంగా అంతకంటే ఎక్కువగానే నడుస్తున్నాయి. అనుమతులు పొందిన తయారీ కేంద్రాల్లో భద్రతపై పర్యవేక్షణ లేకపోవడం, అనధికార కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం కన్పిస్తోంది. ఎల్‌జి పాలిమర్స్, అసెన్షియా ఫార్మా కంపెనీలో మృతుల కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.50 లక్షలు చొప్పున ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాయి. బాణ సంచా తయారీ కేంద్రంలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం విమర్శలకు తావిచ్చింది. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, షాపులు, ఉపాధి కోల్పోయిన వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం కల్పిస్తామని నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) బాండ్లు జారీకి చేపట్టిన అవగాహన కార్యక్రమాల్లో నిర్వాసితులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. పరిహారం నగదుగా ఇవ్వకపోతే రోడ్డు విస్తరణకు భూములు ఇచ్చేదిలేదని తేల్చి చెబుతున్నారు.

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో అటవీశాఖ అనుమతులు లభించక పలురోడ్లు పనులు జరగలేదు. తాగునీటి సమస్య అన్ని ప్రాంతాల్లో ఉంది. అనధికార విద్యుత్ కోతలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి.

గుండెపోటుతో దివీస్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ దివీస్ ల్యాబొరేటరీ ప్రొడక్షన్ విభాగంలో పని చేస్తున్న తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం, ముక్కాముల గ్రామానికి చెందిన వేంద్ర మధుమోహన్ (24) గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం అర్ధ రాత్రి దాటాక చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం..

దివీస్ కంపెనీలో మధుమోహన్ రెండేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2.30గంటలకు డ్యూటీకి వెళ్లిన ఆయన, రాత్రి 11.15 గంటలకు విధులు ముగించుకుని దివీస్ హాస్టల్‌కు వెళ్లాడు. స్నానం చేసిన తర్వాత హాస్టల్ ఆరు బయట మొబైల్ లో మాట్లాడుతూ హాస్టల్‌లోని అతను ఉంటున్న రూమ్ బయట తలుపు వద్ద కుప్ప కూలిపోయాడు. అపస్మారక స్థితిలో మధుమోహన్ పడిఉండడాన్ని తోటి ఉద్యోగులు గమనించి, వెంటనే పరిశ్రమ లో ఉన్న డిస్పెన్సరీ కి తీసుకెళ్లారు. అక్కడి నుంచి సంగివలస, అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గాజువాక : ఈనెల 19న విశాఖలో నిర్వహించే రైల్వే వ్యాగన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైల్వే వాగన్ వర్క్‌షాప్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం వడ్లపూడి వ్యాగన్ వర్క్‌షాప్ వద్ద దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు పర్మినెంట్ చేయలని కోరారు.

రాష్ట్రసదస్సులో దశలవారీగా రైల్వే ప్రయివేటీకరణకు కేంద్రం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా కార్యాచరణతోపాటు, కార్మికులకు నైపుణ్యత ఆధారంగా పనికి తగ్గ వేతనాలను పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయడం ఇతర సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. పెద్దసంఖ్యలో రైల్వే వ్యాగన్ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొని రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి రైల్వే వాగన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.అవతారం, ప్రధాన కార్యదర్శి వి రాజు, యువి.వెంకటేశ్వరరావు, రామకృష్ణ వెంకటరావు పాల్గొన్నారు.

ఆంధ్రా టు ఆంధ్రా.. వయా తెలంగాణ

- ఇదీ విశాఖ విమాన ప్రయాణికుల దుస్థితి
- స్వీయ అనుభవాన్ని సోషల్ మీడియాలో కేంద్రమంత్రికి ట్యాగ్ చేసిన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-మధురవాడ : ఆంధ్రా టు ఆంధ్రా.. వయా తెలంగాణ.. అంటూ ఫేస్‌బుక్ ఖాతాలో కేంద్ర పౌరవిమానాయన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఒక పోస్టును టాగ్ చేసారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ నుంచి పరిపాలన రాజధాని అమరావతి చేరాలంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి రావడం బాధాకరమని, మంగళవారం ఉదయం 8 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు వచ్చిన తాను ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశానిఇకి అమరావతి వెళ్లేందుకు విమానంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుని, అక్కడినుంచి విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్టులో దిగేసరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యిందని తన స్వీయఅనుభవాన్ని ట్యాగ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశానికి విశాఖ నుంచి బయలుదేరిన సిఐఐ, ఫిక్కీ వంటి ట్రేడ్ ప్రతినిధులు కూడా తనలాగే హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరుకున్నారని పోస్ట్‌లో పేర్కొన్నారు.

. విశాఖ - విజయవాడ మధ్య ఉదయం వేళల్లో నడిచే రెండు విమానాలు రద్దు చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని, మంగళవారం కావడంతో వందేభారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారి విశాఖ నుంచి విజయవాడ చేరాల్సి వచ్చిందని అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా తన అనుభవాన్ని పంచుకొన్నారు. ఇదీ విశాఖ విమాన ప్రయాణీకుల దుస్థితి అని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు కూడా ట్యాగ్ చేసారు.

ఆకట్టుకున్న 'గీతం' వైజ్ఞానిక ప్రదర్శన

వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలను పరిశీలిస్తున్న గీతం విసి డిసౌజా

ప్రజాశక్తి-మధురవాడ : గత ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభించిన 'టెక్నాలజి ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రొడక్ట్ ఇంజనీరింగ్ (టెప్)' కోర్సులో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులు తమలోని వినూత్న ఆలోచనలను ఆకర్షణీయమైన ఉత్పత్తుల రూపంలోకి మార్చి మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అబ్బురపరిచింది. విద్యార్థులు అధునాతన ఉపకరణాలతో పాటు 3డి ప్రింటింగ్, డ్రిల్లింగ్, కటింగ్, గ్రైండిరగ్ పద్ధతులు ఉపయోగించి ఇనుము, ప్లాస్టిక్‌లు, చెక్కతో సాంకేతిక ఉత్పత్తులను రూపొందించి యువ ఆలోచనలను చాటిచెప్పారు. దాదాపు 160 మంది గీతం ఇంజనీరింగ్ విద్యార్థులు బృందాలుగా ఏర్పడి దాదాపు 50కి పైగా సాంకేతిక ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు.

అగ్ని ప్రమాధాలలో రక్షించే రోబోట్, అంధులకు మార్గం చూపించే పరికరాలు, వికలాంగులకు ఆధునిక వీల్‌చైర్, ఆకర్షణీయ వ్యవసాయ ఉపకరణాలు, పనిముట్లు, తీర ప్రాంతాల పరిశుభ్రతకు ఉపయోగించే యంత్రాలు, వరదముప్పును గుర్తించే పరికరాలు, స్మార్ట్ పార్కింగ్, సౌర యంత్రాలను శుభ్రపరిచే సామగ్రి, చేతి సంజ్ఞల ఆధారంగా పనిచేసే రోబోట్‌లు, వైద్య రంగంలో ఉపయోగపడే రోబో చేతి నమూనా, నదులలో వ్యర్థాలను శుభ్రపరిచే యంత్రాలను ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు తమ కోర్సులో నేర్చుకున్న అంశాల ఆధారంగా సెన్సార్‌లు, మోటార్‌లు, మైక్రో కంట్రోలర్‌లను తప్పనిసరిగా ఉపయోగిస్తూ అవసరమైన చోట 3డి ప్రింటింగ్ ద్వారా తమ సాంకేతిక నమూనాలను ప్రదర్శనలో ఉంచారు.

గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు తిలకించి, విద్యార్థులను అభినందించారు. ఉత్తమ నమూనాలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గీతం ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వరరెడ్డి, నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న డ్రమ్ముల్లోని బెల్లం ఊటలు

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల మండలం గొంటవానిపాలెం గ్రామ శివారు ప్రాంతంలో అసిస్టెంట్ ఎక్సైజ్ ఎస్‌పి ఆదేశాల మేరకు రంపచోడవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 40 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. బెల్లం ఊట తయారీ దారుడుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఎవరైనా నాటు సారా తయారుచేసినా, అమ్మినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరి వద్దనైనా నాటు సారాయి సంబంధిత సమాచారం ఉంటే రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగలరని, సమాచారం ఇచ్చిన వారి వివరములు గోప్యాంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నాయుడు, సన్యాసిరావు, కానిస్టేబుళ్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ మహిళా రైతులకు సత్కారం

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుతో మొదలు పెట్టి 365 రోజులు ఆదాయం వచ్చే విధంగా ఎటిఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ సాగుతో అధిక దిగుబడులు సాధించిన ఇద్దరు ఆదర్శ మహిళా రైతులు చందల కృష్ణమ్మ, సిరిపురం నరసమ్మలను మంగళవారం తర్లువాడలో అధికారులు గ్రామ పెద్దలు సన్మానించారు మండలంలోని
తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతుగా అవార్డు తీసుకున్న కృష్ణమ్మ మాట్లాడుతూ, ఈవిధానంలో సాగుతో 20 సెంట్లు విస్తీర్ణంలో రూ.40వేలు ఆదాయం సంపాదించానన్నారు.

మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం సాగును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. టిడిపి నేత తాత్రాజు అప్పారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంట దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధర, డిమాండ్ ఉందన్నారు. .జిల్లా ఎన్ఎఫ్ఎ శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ ఈ విధానంలోసాగుపై ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో పొందుపరిచిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ ధనుంజయరావు మండల మోడల్ మేకర్ రామారావు, యూనిట్ ఇన్‌ఛార్జి పైడిరాజు పాల్గొన్నారు



తర్లువాడలోఆదర్శ మహిళా రైతులను సత్కరిస్తున్న అధికారులు, గ్రామపెద్దలు

ధారాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ధారాలమ్మదర్శనానికి ఆలయానికి వచ్చిన భక్తులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్‌లోని ధారాలమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఆంధ్ర, ఒరిస్సా, తెలంగాణ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అరకొర సౌకర్యాలు ఉండడంతో నానా అవస్థలు పడ్డారు. మంగళవారం వర్షం కురవడంతో భక్తులకు మరింత ఇబ్బందికరంగా మారింది. ఆలయం ఎదురుగా ఉన్న కొండపైన సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నిర్మించిన వసతి భవనం ఒకటే ఉండడంతో భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, దేవాలయ శాఖ అధికారులు స్పందించి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆలోచన మానుకోవాలి

సొంత నిధులతో అభివృద్ధి చేయాలి : 197వ రోజు నిరసన దీక్షలో యూనియన్ నేత జగన్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రిని పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేసి, వైద్యసేవలను మెరుగుపరచాలని పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.జగన్ అన్నారు. పిపిపి విధానంలో అభివృద్ధి పేరుతో పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు.
విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా ఆసుపత్రి ఎదుట చేపడుతున్న 197వ రోజు నిరసన దీక్షలో మాట్లాడుతూ 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాల ఆరోగ్యాలతో వ్యాపారం చేయాలని మోడీ ప్రభుత్వం ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. ఇటీవల పోర్ట్ స్టేడియం స్థలంలోనే ప్రయివేటు వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో నిర్లక్ష్యం కారణంగా ఒక బాలుడు దుర్మరణం పాలయ్యాడన్నారు. అదే పోర్టు ఆసుపత్రికి ప్రైవేటుకు కట్టబెడితే, లాభాల వేటలో వారు ఎంతమంది ప్రాణాలతో ఆడుకుంటారో కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. తక్షణమే పోర్టు అసుపత్రి ప్రయివేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరారు.పోర్టు ఉద్యోగులు దీక్షలకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కె సత్యనారాయణ, జె సత్యనారాయణ, కెఎస్.కుమార్, జిసిహెచ్ నాయుడు, శంకర్, శ్రీను, భాస్కర్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

రక్తి కట్టించిన 'భక్త ప్రహ్లాద' నాటకం

ప్రజాశక్తి -మాధవధార : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆర్థిక సాయంతో స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ప్రదర్శించిన భక్త ప్రహ్లాద పౌరాణిక పద్యనాటకం రక్తి కట్టించింది. పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులతోపాటు స్థానికుల విజ్ఞప్తి మేరకు చౌదరి అప్పారావు అధ్యక్షతన ఈ నాటక ప్రదర్శన నిర్వహించారు. బగాది విజయసారథి, బగాది విజయ్ సాయి దర్శకత్వంలో జాహ్నవి లక్ష్మి అద్భుతంగా నటించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కవులు, కళాకారులు, క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు విశాఖ పోర్టుయాజమాన్యం ఎన్నో చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గంట అప్పలనాయుడు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎన్ కనకారావు, జరగడం సత్యనారాయణ, పులి శివప్రకాష్ రావు పాల్గొన్నారు.